- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం
11-04-2026

సంపుటి : 01 సంచిక : 20 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 VOLUME : 01 ISSUE : 20 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha



## కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు
# నానబెట్టారు

- ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో
- గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది కదా
- కేవలం కమీషన్ల కోసమేనేమో అన్న అనుమానాలు
- రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ జపం
- జిహెచ్ఎంసిలో తీవ్ర అవినీతి జరుగుతోంది
- మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, ఏప్రిల్ 10(మహాప్రభ)**

కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ..కమీషన్ల కోసమే ఇప్పుడు

-మిగతా 3 లో



## నేడు లేదా రేపు
# ఇంటర్ ఫలితాలు

- ప్రథమ , ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఒకేసారి విడుదల చేసేందుకు బోర్డు అన్ని కసరత్తులు పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు హాజరు

**హైదరాబాద్, ఏప్రిల్ 10(మహాప్రభ)**

తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల విడుదలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, రాష్ట్ర విద్యాశాఖ ఏప్రిల్ 12న ఆదివారం ఫలితాలను వెల్లడించేందుకు రంగం సిద్ధం చేసినప్పటికీ, పలు జాతీయ స్థాయి నివేదికల ప్రకారం ఒక రోజు ముందే అంటే ఏప్రిల్ 11న శనివారం కూడా ఫలితాలు వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

-మిగతా 3 లో

## 20న బీఆర్ఎస్‌లోకి
# జీవన్‌రెడ్డి

### జగిత్యాలలో భారీ బహిరంగసభ

- ముఖ్యఅతిథిగా రావాలంటూ కేసీఆర్‌కు జీవన్‌రెడ్డి విజ్ఞప్తి
- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో భేటీ
- మీతో కలిసి పనిచేయాలని ఆ దేవుడే పంపాడన్న మాజీమంత్రి
- ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పలకించిన కెసిఆర్

**మర్కుక్ ఏప్రిల్ 10(మహాప్రభ)**

మాజీమంత్రి టి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 20న ఆయన గులాబీ తీర్థం పుచ్చుకోనున్నారు. అదేరోజు జగిత్యాలలో భారీ బహిరంగ సభను నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నది. శుక్రవారం హైదరాబాద్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలిశారు. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఉన్న ఈ ఇద్దరు నేతలు, తాజా పరిణామాల నేపథ్యంలో అత్యంత ఆత్మీయంగా కలుసుకున్నారు.

-మిగతా 3 లో




## పామునైనా నమ్మొచ్చు కాని బీజేపీని నమ్మలేం : మమత

3



# అమెరికాతో ఆటలొద్దు

- ఇరాన్‌కు జేడీ వాన్స్ తీవ్ర హెచ్చరిక.
- ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్-అమెరికా శాంతి చర్చలు.
- విశ్వసనీయతతో ఉండాలి, లేదంటే పరిణామాలు తీవ్రం: వాన్స్.
- పాకిస్థాన్ ప్రధాని మధ్యవర్తిత్వంలో దౌత్యపరమైన చర్చలు.
- ట్రంప్ ఆదేశాలతో రంగంలోకి వాన్స్, కుష్నర్ బృందం.

**న్యూఢిల్లీ ఏప్రిల్ 10(మహాప్రభ)**

అమెరికాతో ఆటలు ఆడాలనుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇరాన్‌ను హెచ్చరించారు. పశ్చిమాసియాలో యుద్ధానికి విరామం ప్రకటించినందున శాంతి చర్చల కోసం పాకిస్థాన్‌కు వెళ్లే ముందు వాన్స్ మీడియాతో మాట్లాడుతూ అమెరికా వైఖరిని స్పష్టం చేశారు. తమ అధ్యక్షుడి ఆదేశాల మేరకు దౌత్యపరమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ సమయంలో ఇరాన్ తమతో

-మిగతా 3 లో





## బెంగాల్ ఓటర్లకు
# బీజేపీ తాయిలాలు

- మహిళలు, నిరుద్యోగులకు నెలకు రూ. 3,000 సాయం
- ఎన్నికల మ్యానిఫెస్టోలో బీజేపీ భారీగా ఉచిత హామీలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10(మహాప్రభ)**

ఉచితాలకు తాము వ్యతిరేకమని చెప్పుకొనే భారతీయ జనతా పార్టీ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు భారీగా తాయిలాలు ప్రకటించింది. ప్రతి మహిళ, నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3,000 చొప్పున ఆర్థిక సాయాన్ని అందచేస్తామని వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన సంఘాన్ని నియమిస్తామని హామీ ఇవ్వడంతోపాటు చొరబాటుదారుల పట్ల కఠిన వైఖరిని అవలంబిస్తామని వాగ్దానం చేసింది. పోలీసు శాఖసహా అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కూడా బీజేపీ హామీ ఇచ్చింది.

-మిగతా 3 లో

## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై
# కాంగ్రెస్ ఫోకస్

### మహిళా బిల్లు, డిలిమిటేషన్ అంశాలపై చర్చ


- ఈ రెండు అంశాలపై కాంగ్రెస్ సుదీర్ఘ కసరత్తు
- రాజకీయ లబ్ధికోసంమే ప్రత్యేక సమావేశాలన్న ఖర్గే
- తెలంగాణలో డీలిమిటేషన్ ను రేవంత్ నివేదిక సమర్పణ

**న్యూఢిల్లీ ఏప్రిల్ 10(మహాప్రభ)**

జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సమాలోచనలు చేసింది. ముఖ్యంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. మహిళా బిల్లు, సీట్లు పెంపుదల వంటి రెండు అంశాలపై వ్యూహాత్మకంగా ఉండాలని నిర్ణయించారు. దేశ రాజధాని ఢిల్లీ ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీసమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం.

-మిగతా 3 లో





## వైభవ్ దెబ్బ..
# ఆర్సీబీ అబ్బా

### హేజిల్‌వుడ్‌ను కూడా వదల్లేదుగా..!

- ఐపీఎల్ 2026లో ఆర్సీబీకి తొలి ఓటమి
- ఆర్ఆర్ చేతిలో 6 వికెట్ల తేడాతో పరాజయం
- వరుసగా నాలుగో విజయం సాధించిన ఆర్ఆర్

**న్యూఢిల్లీ ఏప్రిల్ 10(మహాప్రభ)**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ హవా కొనసాగుతోంది. ఈ సీజన్‌లో రెండోసారి అతడు 15 బంతుల్లో హాఫ్ సెంచరీ స్కోరు చేశాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో శుక్రవారం జరిగిన మ్యాచులు ఈ చిచ్చరపిడుగు విధ్వంసం సృష్టించాడు. 26 బంతుల్లో ఏకంగా 78 పరుగులు చేశాడు. హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ లాంటి బౌలింగ్‌లోనూ ఊచకోత కోశాడు. దీంతో ఈ టోర్నీలో ఆర్ఆర్ వరుసగా నాలుగో విజయాన్ని సాధించింది. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఐపీఎల్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్

-మిగతా 3 లో




## నేడు ఇస్లామాబాద్‌లో
# శాంతి చర్చలు

- పటిష్టమైన భద్రత నడుమ పాకిస్తాన్ రాజధాని
- నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటన
- భారీగా బందోబస్తు ఏర్పాటు

**ఇస్లామాబాద్ ఏప్రిల్ 10(మహాప్రభ)**

అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం తొలగిపోలేదు. సీజ్‌ఫైర్ వేళ.. శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న శనివారం రాజధాని ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది. ఇస్లామాబాద్‌లో దేశ పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలున్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. ఈ చర్చల నేపథ్యంలో గురువారం, శుక్రవారం ఇస్లామాబాద్‌లో సెలవు

-మిగతా 3 లో



## వివాదంలో
# మోనాలిసా పెళ్లి

- పెళ్లినాటికి ఆమె మైనర్ అని గుర్తింపు
- భర్తపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

3

## టోల్ ప్లాజాల వద్ద ఇక
# నో క్యాష్ పేమెంట్స్

- అమల్లోకి కొత్త నిబంధనలు



3

## జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా



**అలహాబాద్ – ఏప్రిల్ 10 (మహాప్రభ)**
జస్టిస్ యశ్వంత్ వర్మ జడ్జి పోస్టుకు గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని ఆయన రాష్ట్రపతిని కోరారు. నిరుడు ఢిల్లీ హైకోర్ట్ జడ్జిగా ఉన్నప్పుడు ఆయన ఇంట్లో కాలిపోయిన నోట్ల కట్టలు లభించడం రాజకీయ, న్యాయ వర్గాల్లో పెను దుమారం రేపింది. దీనిపై పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపింది.మొదట ఆ ఘటనతో తనకు సంబంధం లేదని.. ఆ సమయంలో తాను అక్కడ లేనని, తనను ఎందుకు అభిశంసించాలని జస్టిస్ వర్మ ప్రశ్నించారు. అయితే ఘటన జరిగిన గదిపై జస్టిస్ వర్మ కుటుంబానికి నియంత్రణ ఉందని పార్లమెంటరీ విచారణ కమిటీ తెలిపింది. మరోవైపు ఆయనను అభిశంసించాలని 146 మంది ఎంపీలు చేసిన తీర్మాన ప్రతిపాదన త్వరలోనే పార్లమెంట్ ముందుకు వచ్చే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో జస్టిస్ వర్మ రాజీనామా చేయడం గమనార్హం.

## జిల్లా అదనపు కలెక్టర్ ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ.

**మెదక్ జిల్లా – ఏప్రిల్ 10 (మహాప్రభ)**
మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ చిన్న శంకరంపేట మండలం గవల్లపల్లి జంగరాయిపేట లో ఎరువుల దుకాణంను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులను, స్టాక్ నిల్వలు, బిల్లు పుస్తకాలు, స్టాక్ ఇన్వాయిస్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదరపు కలెక్టర్ . మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని దుకాణ యజమానులకు సూచించారు. అనుమతుల్లేని నాసిరకం ఎరువులు విత్తనాలు, పురుగుమందులను అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి త్వరగా తినండి నిర్మించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ




**దేవరకొండ – ఏప్రిల్ 10 (మహాప్రభ)**
శుక్రవారం ఉదయం దేవరకొండ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఉదయం ICDS పరిధిలోని దేవరకొండ సెక్టార్కు సంబంధించిన అంగన్వాడి టీచర్లకు 5+ సెల్ ఫోన్ లను శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అంగన్వాడీలకు డ్యూటీలో ఈ మొబైల్స్ చాలా ఉపయోగకరమని తెలిపారు. అంగన్వాడికి సంబంధించిన ఫొటోస్ కి స్క్రాప్సెస్ కి సంబంధించిన తదితర పనులకు ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ×జణూ అధికారిని చంద్రకళ, సూపర్వైజర్లు రేణుక. టీచర్లు పద్మ. బాలమణి. వాస్కుల పద్మ. టి. పద్మ. ప్రభావతి. జ్యోతి. మణెమ్మ. సునంద. తదితరులు పాల్గొన్నారు

## పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమం..

**-సీసీ కెమెరాలు ఏర్పాటు -ఎస్సై మహేందర్.**



**గాంధారి, – ఏప్రిల్ 10 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండల్ బీర్మల్ తాండ గ్రామంలో శుక్రవారం గాంధారి ఎస్సై మహేందర్ సందర్శించారు గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మరియు సిసి కెమెరా యొక్క ఉపయోగాల గురించి కూడా చెప్పారు గంజాయి ఎవరైనా అమ్మిన పండించిన తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్లైన్ మోసాలు గురించి కూడా తాండ గ్రామస్తులకు సూచించారు.

## పామునైనా నమ్మొచ్చు కాని బీజేపీని నమ్మలేం : మమత

**కోల్‌కతా, – ఏప్రిల్ 10 (మహాప్రభ)**
ఈశాన్య రాష్ట్రాల ప్రజల నుంచి ఓట్లను సాధించగలమన్న నమ్మకం కోల్పోయినందునే బీజేపీ అస్సాం ఎన్నికల కోసం వెలుపల నుంచి ప్రజలను తీసుకువచ్చిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం ఆరోపించారు.ఉత్తర 24 పరగణాల జిల్లాలోని తెంతులియా వద్ద ఓ ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగిస్తూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కింద దేశంలోని అన్ని దర్యాప్తు సంస్థలు నిష్పాక్షితను కోల్పోయాయని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను బీజేపీ కొనేసిందంటూ ఆమె ఆరోపించారు. ఉత్తర్ ప్రదేశ్ నుంచి ఓ రైలు నిండా 50,000 మందిని అస్సాంకు తీసుకువచ్చారు అని ఆమె ఆరోపించారు. పామునైనా నమ్మొచ్చునేమో కాని బీజేపీని మాత్రం కాదని ఆమె విమర్శించారు.

## ఆ ఊళ్లో బూతులు మాట్లాడితే
# జేబుకు చిల్లు పడినట్లే

**న్యూఢిల్లీ, – ఏప్రిల్ 10 (మహాప్రభ)**
అది పూర్తిగా బూతుల రహిత గ్రామం..! ఆ గ్రామంలో బూతులు మాట్లాడటంపై నిషేధం ఉంది..! నిషేధాన్ని ఉల్లంఘించి ఎవరైనా బూతులు మాట్లాడితే వారి జేబుకు చిల్లుపడినట్లే. ఏకంగా రూ.500 జరిమానా కట్టాల్సిందే. ఈ మేరకు ఆ గ్రామ పంచాయతీ తీర్మానం కూడా ఉంది. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని గ్రామ పెద్దలు చెప్పారు.సాధారణంగా గ్రామాల్లో అయినా, పట్టణాల్లో అయినా గొడవలు జరుగుతుంటాయి. ఈ గొడవల సందర్భంగా బూతులు కూడా దొర్లుతాయి. ఇలా బూతులు జారడంవల్ల చిన్న గొడవలు కూడా పెద్దవిగా మారుతాయి. అందుకే మధ్యప్రదేశ్ రాష్ట్రం




బుర్హాన్‌పూర్ జిల్లాలోని బోర్‌సర్ గ్రామంలో బూతులపై పూర్తిగా నిషేధం విధించారు. నిషేధాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే రూ.500 జరిమానా విధించనున్నట్లు ప్రకటించారు. బుర్హాన్‌పూర్ జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ గ్రామంలో 6 వేల మంది జనాభా ఉంటారు. గ్రామంలో ధనిక, పేద తేడా లేకుండా ఎవరు బూతులు మాట్లాడినా రూ.500 జరిమానా విధిస్తారు. ఒకవేళ జరిమానా కట్టకపోతే గంటసేపు గ్రామంలో పారిశుధ్య పనులు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు గ్రామమంతా పోస్టర్లు వేయించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కాగా, బూతులతో గొడవలు పెద్దవి చేసుకోకుండా ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నామని, ప్రత్యేక బృందాలతో పర్యవేక్షణ చేయిస్తున్నామని సర్పంచి అంతర్‌సింగ్ తెలిపారు. గ్రామంలో గ్రంథాలయం కూడా ఏర్పాటు చేశామని, అదేవిధంగా నాలుగుచోట్ల ఉచిత వైఫై సదుపాయం, గ్రామం అంతటా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు.

## హొర్ముజ్‌లో అమెరికా
# డ్రోన్ మిస్సింగ్!

**ధర రూ.1,800 కోట్లు**



**వాషింగ్టన్ – ఏప్రిల్ 10 (మహాప్రభ)**
అగ్రరాజ్యం అమెరికాకు మరో భారీ షాక్. హొర్ముజ్‌లో సీక్రెట్ ఆపరేషన్ సందర్భంగా ఆ దేశానికి చెందిన నిఘా డ్రోన్ ఎంక్యూ-4సీ ట్రైటన్ గల్లంతైంది. ఈ డ్రోన్ ధర రూ.1800 కోట్లకు పైమాటే. ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా పెద్ద ఎత్తున యుద్ధ విమానాలను కోల్పోయిన సంగతి తెలిసిందే.తాజాగా అత్యంత ఖరీదైన డ్రోన్ కనిపించకుండా పోవడం ఆ దేశానికి గట్టి ఎదురుదెబ్బే అని భావిస్తున్నారు. ఈ డ్రోన్ కూలిపోయిందా లేక ఇరాన్ కూల్చిందా అన్న విషయం తెలియరాలేదు. 2018లో ఈ డ్రోన్ అమెరికా అమ్ములపొదిలో చేరింది. ఇరాన్ యుద్ధంలో ఎఫ్-35, ఎఫ్-15ఈ, ఏ-10 యుద్ధ విమానాలను అమెరికా కోల్పోయింది. అలాగే 17 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లను కూడా నష్టపోయింది.

## ఆయుధాలతో యుద్ధ నౌకలు సిద్ధం..


**ఇరాన్‌కు ట్రంప్ తాజా హెచ్చరిక**



**న్యూఢిల్లీ, – ఏప్రిల్ 10 (మహాప్రభ)**
ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలకు సమయం ముంచుకొస్తున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. ఇరాన్ వద్ద ఇక ఏ మార్గమూ మిగల్లేదని, కీలక అంతర్జాతీయ జలమార్గాలపై నియంత్రణ ద్వారా ప్రపంచాన్ని స్వల్పకాలికంగా దోచుకోవడంపై మాత్రమే ఇరాన్ ఆధారపడుతున్నదని ట్రంప్ విమర్శించారు.తమ వద్ద వేరే మార్గాలు లేవని ఇరానీయులు ఇంకా గ్రహించినట్లు లేరని ఆయన వ్యాఖ్యానించారు. వారు ఈ రోజు సజీవంగా ఉండడానికి ఏకైక కారణం చర్చలు జరపడమే అని ఆయన పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో శాంతి చర్చలు విఫలమైతే దాడులను పునరుద్ధరించడానికి శక్తివంతమైన ఆయుధాలతో అమెరికా యుద్ధ నౌకలను సిద్ధం చేస్తున్నట్లు న్యూయార్క్ పోస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హెచ్చరికలు జారీచేసిన కొన్ని గంటల్లోనే ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

## 40 రోజుల్లో 5000 మంది ఇరానీ సైనికులు మృతి: ఐడీఎఫ్

**జెరుసలాం – ఏప్రిల్ 10 (మహాప్రభ)**
ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఇరాన్‌పై ఆకస్మిక దాడి చేసిన విషయం తెలిసిందే. ఇరాన్‌పై జరిగిన దాడిలో మొదటి రోజే ఆ దేశ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీతో పాటు సుమారు 40 మంది మిలిటరీ కమాండర్లు చనిపోయారు. అయితే కేవలం 40 సెకన్లలోనే 40 మంది టాప్ ఇరానీ మిలిటరీ కమాండర్లను హతమార్చినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం(×ణఖీ) పేర్కొన్నది. ఇరాన్‌తో సీజ్‌ఫైర్ కుదిరిన నేపథ్యంలో ఐడీఎఫ్ ఓ రిపోర్టును రిలీజ్ చేసింది. 40 రోజుల వార్‌లో అనేక మంది ఇరానీ కమాండర్లను చంపినట్లు ఐడీఎఫ్ చెప్పింది. డజన్ల సంఖ్యలో సీనియర్, మీడియా రేంజ్ ఇరానీ ఆఫీసర్లను కూడా ఏరివేసినట్లు ఇజ్రాయెల్ పేర్కొన్నది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో సుమారు 5 వేల మంది ఇరానీ సైనికులు మృతిచెందినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. వేల సంఖ్యలో ఇరానీ సైనికులు గాయపడినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. మృతుల్లో అంతర్గత భద్రతా బలగాలు, బసిజి పారామిలిటరీ దళాలు ఉన్నట్లు తెలిసింది.ఇజ్రాయిలీ అటాక్‌లో మృతిచెందిన వారిలో ఖమేనీతో పాటు మిలిటరీ అడ్వైజర్ అలీ శామ్‌ఖానీ, ఐఆర్జీసీ కమాండ్ మొహమ్మద్ పాక్‌పౌర్, ఐఆర్జీసీ నేవీ చీఫ్ అలీరెజా తంగసిరి, ఐఆర్జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మసీద్ ఖాదేమి,



బసిజి పారామిలిటరీ దళ కమాండర్ గోలంరెజా సోలేమానీ, ఐఆర్జీసీ ప్రతినిధి అలీ మొహమ్మద్ నైని, నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ హెడ్ అలీ లారిజారి, డిఫెన్స్ మినిస్టర్ అజిన్ నాసిర్‌జాద్ఏ, ఎస్ఎపీఎస్డీ చైర్మెన్ హుసేన్ జాబల్ అమేలియన్, ఖమేనీ మిలిటరీ సెక్రటరీ మొహమ్మద్ షిరాజి ఉన్నారు. ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను టార్గెట్ చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. అనేక ఇరానీ అణు కేంద్రాలపై దాడులు చేసినట్లు చెప్పింది. ఇరాన్ వద్ద సుమారు 60 శాతం శుద్ధీకరించిన 400 కేజీల యురేనియం ఉన్నట్లు ఇజ్రాయెల్ అనుమానం వ్యక్తం చేసింది. ఆ యురేనియంతో దాదాపు 11 అణు బాంబులను తయారు చేయవద్దు అని ఇజ్రాయిల్ అధికారులు అంచనా వేశారు. యాజ్ద్ పట్టణం వద్ద ఉన్న న్యూక్లియర్ ప్లాంట్‌పై దాడి చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. అరాక్‌లో ఉన్న హెవీ వాటర్ రియాక్టర్‌పై కూడా దాడి జరిగింది. టెహ్రాన్‌లోని మలేక్ అస్తార్ యూనివర్సిటీలో ఉన్న న్యూక్లియర్ రీసర్చ్ డెవలప్మెంట్ సైట్, పార్చిన్ మిలిటరీ కాంప్లెక్స్‌లోని తలేగాన్ 2 కేంద్రం, మిన్‌జాదేహి సీక్రెట్ అండర్‌గ్రౌండ్ కేంద్రంతో పాటు ఇతర అణు కేంద్రాలను టార్గెట్ చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఇరాన్‌కు ఆర్థిక నష్టం కలిగించే గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై అటాక్ చేసినట్లు ఐడీఎఫ్ చెప్పింది. రెండు భారీ స్టీల్ ఫ్యాక్టరీలు, అనేక పెట్రోకెమికల్ కేంద్రాలు, 10 కీలకమైన రైలు మార్గాలు, బ్రిడ్జ్‌లను పేల్చినట్లు ఐడీఎఫ్ తెలిపింది. పెట్రోకెమికల్ కేంద్రాల్లో ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసినట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. రైలు మార్గాలు, బ్రిడ్జ్‌ల ద్వారా ఆయుధాలను ఇరాన్ సరఫరా చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది.

## రాశీసాగర్ రామునికి తలంబ్రాలు..

-తొలిసారిగా భద్రాచల తలంబ్రాలతో సీతారాముల కళ్యాణం...
-10 కిలోల తలంబ్రాలు ముత్యాల తలంబ్రాలు అందజేత..
-500 ఏళ్ల నాటి చరిత్ర నేడు సహకారం...
-మాకు మహాభాగ్యం కలిగిందన్న గ్రామ భక్తులు..

**దుబ్బాక – ఏప్రిల్ 10 (మహాప్రభ)**
సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల్ రాంసాగర్ గ్రామంలో ఈరోజు నెల 11వ తేదీన సీతారాముల కళ్యాణం జరుగును, ఈ కళ్యాణం భద్రాచలంలో జరిగిన పిమ్మట 15 రోజుల తర్వాత భద్రాచలం ముత్యాల తలంబ్రాలతో ఇక్కడ కళ్యాణం జరగడం ఆనాటి నుండి వస్తున్న సాంప్రదాయం శుక్రవారం నాడు తొలిసారిగా 10 కిలోల భద్రాచల ముత్యాల తలంబ్రాలు మరియు గోటి తలంబ్రాలు ప్రత్యేక పూజలు జరిపి దేవాలయ ప్రతినిధులకు అందజేశారు.



శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు, ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాటి పూర్వికులు భద్రాచల కళ్యాణం తిలకించి కళ్యాణ ముత్యాల తలంబ్రాలు తీసుకొని పాదయాత్ర చేసుకుంటూ 15 రోజుల తర్వాత రామ్ సాగర్ గ్రామానికి చేరుకున్నారని తెలిపారు. అప్పుడు ఆ ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కళ్యాణం జరిపారని ఆనాటి చరిత్ర అన్నారు. 500 ఏండ్ల చరిత్రను నేడు భద్రాచలం ముత్యాల తలంబ్రాలు అందజేసి నాటి చరిత్రను షష్టత్కరింపజేశారు. సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు, భద్రాచల రామయ్య కళ్యాణానికి గోటి తలంబ్రాలు అందించిన ఘనత రామ్ సాగర్ గ్రామానికి దక్కిందన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్ శర్మ మాట్లాడుతూ భద్రాచల తలంబ్రాలు మనకు రామకోటి రామరాజు అందజేయడం ఆయన రామ భక్తికి నిదర్శనం అన్నారు. తొలిసారిగా తలంబ్రాలు రావడం అదృష్టం అన్నారు ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రతినిధులు గ్రామ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# అమెరికాతో ఆటలొద్దు

మొదటి తరువాయి

ఆటలు ఆడాలని చూస్తే సహించబోమని వాన్స్ స్పష్టం చేశారు.ఆరు వారాలుగా క్షిపణుల మోతతో అట్టుడికిన పశ్చిమాసియాలో యుద్ధానికి విరామం ప్రకటించిన అమెరికా టెహ్రాన్‌తో దౌత్యపరమైన చర్చలకు సిద్ధమైంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఉన్నత స్థాయి బృందంతో కలిసి శుక్రవారం పాకిస్థాన్ బయల్దేరారు. టెహ్రాన్‌తో చర్చల కోసం మేము సిద్ధంగా ఉన్నాం. ఇరుదేశాల మధ్య శాంతి చర్చలు సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను అని పాకిస్థాన్‌కు వెళ్లడానికి ముందు వాన్స్ పేర్కొన్నారు.టెహ్రాన్‌తో దౌత్యపరమైన చర్చల విషయమై అధ్యక్షుడు ట్రంప్ మాకు కీలకమైన సూచనలు చేశారు. ఆయన మాట ప్రకారం ఇరాన్ విశ్వసనీయతతో చర్చలు జరిపితే మేము సానుకూలంగా స్పందిస్తాం. అలా కాకుండా వారు మాతో ఆటలు ఆడాలనుకుంటే మాత్రం చర్చలకు వచ్చిన బృందం వారి మాట అస్సలు వినదు. అయితే.. మేము మాత్రం ఇరుదేశాల ప్రతినిధుల మధ్య చర్చలు సానుకూలంగా జరగడానికి ప్రయత్నిస్తాం' అని వాన్స్ వెల్లడించారు. అమెరికా, టెహ్రాన్ మధ్య ఇస్లామాబాద్ వేదికగా దౌత్యపరమైన చర్చలకు చాలా ప్రాధాన్యం ఉంది. వాన్స్‌తో పాటు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్‌లతో కూడిన బృందం పాక్ ప్రధాని మధ్యవర్తిత్వంలో టెహ్రాన్ ప్రతినిధులుతో చర్చలు జరుపనుంది.

# బెంగాల్ ఓటర్లకు బీజేపీ తాయిలాలు

మొదటి తరువాయి

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం సంకల్ప్ పత్ర పేరిట బీజేపీ శుక్రవారం ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మ్యానిఫెస్టో విడుదల చేస్తూ ఇది సోనార్ బంగ్లా నిర్మాణం కోసం రోడ్డుమ్యాపుగా అభివర్ణించారు.

# నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు

మొదటి తరువాయి

ప్రకటించారు. దుకాణాలు మూతపడ్డాయి. తమ మధ్యవర్తిత్వంతోనే రెండు వారాల పాటు కాల్పుల విరమణ జరిగిందని చెప్పిన పాకిస్థాన్ .. ఇప్పుడు ఇరుదేశాల మధ్య శాంతిచర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నేతృత్వంలోని బృందం అమెరికా తరఫున చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాక్ బయల్దేరారంటూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. వారిద్దరూ తమ రాజధాని టెహ్రాన్‌లోనే ఉన్నారని చెప్పింది. ఒకవేళ చర్చలంటూ జరిగితే.. హార్మూజ్‌పై నియంత్రణ, తమ దేశంపై ఉన్న ఆంక్షల నుంచి ఉపశమనం, తన మిత్రపక్షాలపై దాడులు చేయకూడదంటూ 10 పాయింట్ల డిమాండ్ల పైనే ఇరాన్ పట్టుబట్టే అవకాశం ఉంది. ఇక, లెబనాన్‌లోని ఇరాన్ మిత్రపక్షం హెజ్‌బొల్లా గ్రూప్‌పై ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆగడం లేదు. సీజ్‌÷ర్ ప్రకటన తర్వాతే అక్కడ మారణహోమం సృష్టించింది. అమెరికా–ఇరాన్ మధ్య ఉన్న అపనమ్మకం, ఇజ్రాయెల్ దూకుడు కారణంగా ఈ చర్చల్లో పురోగతిని ఆశించలేమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# వైభవ్ దెబ్బ.. ఆర్సీబీ అబ్బా

మొదటి తరువాయి

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఇదే తొలి ఓటమి కావడం గమనార్హం. 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్‌కు వైభవ్ సూర్యవంశీ మెరుపు ఆరంభాన్ని అందించాడు. వైభవ్ సూర్యవంశీ (26 బంతుల్లో 78 రన్స్), ధ్రువ్ జురెల్ (43 బంతుల్లో 81 రన్స్) రాణించడంతో పవర్ ప్లే ముగిసే సరికి 97/1తో నిలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. వైభవ్ సూర్యవంశీ పవర్ ప్లే ముగిసే సరికే 15 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసి.. ఆర్సీబీ నుంచి మ్యాచ్ లాగేశాడు.వైభవ్ ఔట్ అయిన కాసేపటికే హిట్‌మెయర్ (0), రియాన్ పరాగ్ (3) పెవిలియన్ చేరినా.. రవీంద్ర జడేజా సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. జురెల్‌తో కలిసి అబేధ్యమైన ఐదో వికెట్‌కు 50 బంతుల్లో 68 రన్స్ జోడించాడు. 25 బంతుల్లో 24 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ మ్యాచులో ఆర్ఆర్ 4 వికెట్లు కోల్పోయి 18 ఓవర్లలో మ్యాచ్ ముగించింది. టోర్నీలో వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ భారీ స్కోరు చేసింది. ఓ దశలో 2.5 ఓవర్లలో 45/1తో భారీ స్కోరుపై కన్నేసింది. ఆ తర్వాత 94/6, 125/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కానీ చివర్లో కెప్టెన్ రజత్ పటీదార్ (40 బంతుల్లో 63 రన్స్), ఇంపాక్ట్ ప్లేయర్ వెంకటేశ్ అయ్యర్ (15 బంతుల్లో 29 రన్స్) సత్తాచాటడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 రన్స్ స్కోరు చేసింది.

# నేడు లేదా రేపు ఇంటర్ ఫలితాలు

మొదటి తరువాయి

ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18 వరకు జరిగిన వార్షిక పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ , ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఒకేసారి విడుదల చేసేందుకు బోర్డు అన్ని కసరత్తులు పూర్తి చేసింది. విద్యార్థులు తమ ఫలితాలను విడుదలైన వెంటనే అధికారిక వెబ్‌సైట్లలో హాల్ టికెట్ నంబర్‌ను నమోదు చేసి మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## పామునైనా నమ్మొచ్చు కాని బీజేపీని నమ్మలేం : మమత



కోల్‌కతా,ఏప్రిల్ 10

ఈశాన్య రాష్ట్రాల ప్రజల నుంచి ఓట్లను సాధించగలమన్న నమ్మకం కోల్పోయినందునే బీజేపీ అస్సాం ఎన్నికల కోసం వెలుపల నుంచి ప్రజలను తీసుకువచ్చిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం ఆరోపించారు.ఉత్తర 24 పరగణాల జిల్లాలోని తెంతులియా వద్ద ఓ ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగిస్తూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కింద దేశంలోని అన్ని దర్యాప్తు సంస్థలు నిష్పాక్షితను కోల్పోయాయని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను బీజేపీ కొనేసిందంటూ ఆమె ఆరోపించారు. ఉత్తర్ ప్రదేశ్ నుంచి ఓ రైలు నిండా 50,000 మందిని అస్సాంకు తీసుకువచ్చారు అని ఆమె ఆరోపించారు. పామునైనా నమ్మొచ్చునేమో కాని బీజేపీని మాత్రం కాదని ఆమె విమర్శించారు.

# పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై కాంగ్రెస్ ఫోకస్

మొదటి తరువాయి



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు. 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు. కేవలం మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రత్యేక సమావేశాలను పిలవడంతో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ బలోపేతంపై సీఎం రేవంత్‌రెడ్డి సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక ప్రసంగం చేసే అవకాశం ఉంది. సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టతని ఇచ్చామని, కేంద్రాన్ని డిమాండ్ కూడా చేశామని ప్రస్తావించారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ హఠాత్తుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు సవరణ , పునర్విభజన చట్టం సవరణ బిల్లులను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక అఖిలపక్ష సమావేశం పెట్టాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలన్నీ కోరాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం ప్రయత్నం చేస్తుందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# వివాదంలో మోనాలిసా పెళ్లి

**-పెళ్లినాటికి ఆమె మైనర్ అని గుర్తింపు**

**-భర్తపై ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు**

**లక్నో,**



కుంభమేళాలో ఒక్క ఫోటోతో రాత్రికి రాత్రే సోషల్ మీడియా స్టార్‌గా మారిన గిరిజన యువతి మోనాలిసా ఇప్పుడు తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ఆమె ప్రేమ వివాహం చట్టపరమైన సమస్యల్లో పడడంతో చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన మోనాలిసా, అనంతరం ఫర్మన్ ఖాన్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. అయితే ఈ పెళ్లి చట్టబద్ధతపై అనుమానాలు వ్యక్తమవడంతో విచారణ ప్రారంభమైంది.జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టగా, అసలు విషయం మోనాలిసా మైనర్ అని తేలింది. మహేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రి రికార్డుల ప్రకారం మోనాలిసా 2009 డిసెంబర్ 30న జన్మించినట్లు తేలింది. అంటే 2026 మార్చిలో వివాహం జరిగే సమయానికి ఆమె వయస్సు కేవలం 16 సంవత్సరాలు మాత్రమే. వివాహానికి కనీస వయస్సు లేకపోవడంతో, ఆమె భర్తపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరో సంచలన అంశం కూడా బయటపడింది. పెళ్లి జరిపించేందుకు మోనాలిసా పుట్టిన తేదీని మారుస్తూ నకిలీ ధృవీకరణ పత్రాలు సృష్టించినట్లు దర్యాప్తులో తేలింది. 2008లో పుట్టినట్లు చూపిస్తూ తప్పుడు సర్టిఫికెట్ల ఆధారంగా కేరళలోని ఆలయంలో వివాహం నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు.ఈ వ్యవహారంలో కొన్ని సంస్థల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది సాధారణ ప్రేమ వివాహం కాదని, ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా చేసిన చర్యగా అధికారులు పరిశీలిస్తున్నారు. కేరళ నుంచి మధ్యప్రదేశ్ వరకు విస్తరించిన ఈ కేసును విచారణ బృందం కేవలం 72 గంటల్లోనే కీలకంగా ఛేదించింది. మహేశ్వర్ మున్సిపల్ అధికారులు ఇచ్చిన పాత జనన ధృవీకరణ పత్రాన్ని రద్దు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మోనాలిసా తల్లిదండ్రులు సమర్పించిన కుల ధృవీకరణ పత్రాల ద్వారా ఆమె షెడ్యూల్డ్ తెగకు చెందిన మైనర్ బాలిక అని కూడా నిర్ధారితమైంది. మైనర్ బాలికని వివాహం చేసుకున్నందుకు ఫర్మన్ ఖాన్ ప్రస్తుతం తీవ్రమైన చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడంతో అతనిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

మొదటి తరువాయి

కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కూడా కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# 20న బీఆర్ఎస్‌లోకి జీవన్‌రెడ్డి

మొదటి తరువాయి

వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్‌ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈనెల 20న జగిత్యాలలో జరిగే బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా కేసీఆర్‌ను జీవన్ రెడ్డి ఆహ్వానించారు. 'మీతో కలిసి పనిచేయాలని ఆ దేవుడే తనను పంపాడు.. తిరోగమనంలో ఉన్న కాంగ్రెస్‌పై యుద్ధం చేయాలి' అంటూ ఎమోషన్ అయినట్టు సమాచారం. కాగా కొద్ది రోజులుగా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై అసంతృప్తితో ఉన్న ఆయన ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. కేటీఆర్ ఆయనతో చర్చలు జరిపారు. గురువారం స్వయంగా జగిత్యాలకు వెళ్లి భేటీ అయ్యారు. ఈ క్రమంలో జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గంగుల కమాలకర్, కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కె.విద్యాసాగర్‌రావు, మాజీ కార్పొరేషన్ చైర్మెన్ గ్యాదరి బాలమల్లు, మాజీ జిల్లా చైర్మెన్ వసంత తదితరులున్నారు.

# టోల్ ప్లాజాల వద్ద ఇక నో క్యాష్ పేమెంట్స్

## అమల్లోకి కొత్త నిబంధనలు



న్యూఢిల్లీ

జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల వద్ద టోల్ రుసుమును శుక్రవారం నుంచి నగదు రూపంలో చెల్లించే అవకాశం లేదని కేంద్ర రోడ్డు రవాణా శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కేవలం ఫాస్టాగ్ లేదా యూపీఐ ద్వారా మాత్రమే చెల్లింపులు చేయాలని స్పష్టం చేసింది.డిజిటల్ చెల్లింపులు చేసే అవకాశం లేని వాహనదారులకు ఇది ఇబ్బందికరమైనా.. టోల్ గేట్ల వద్ద భారీ వరుసలను తగ్గించి ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు ఈ కొత్త నిబంధనను అమలు చేస్తున్నట్టు ఓ సీనియర్ అధికారి తెలిపారు. మరోవైపు ఫాస్టాగ్‌తో కాకుండా యూపీఐతో చెల్లింపులు జరిపితే 1.25 రెట్లు ఎక్కువగా టోల్ చెల్లించాల్సి ఉంటుందని నోటిఫికేషన్ తెలిపింది. ఈ నెల 1న ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరను ఎన్‌హెచ్ఏఐ 2.5 శాతం పెంచడంతో దాని ధర రూ.3,075కు చేరుకొన్నది.

# సంపాదకీయం

## పూలే ఎజెండా నేటి దేశానికి అవసరం!



నేడు ఏప్రిల్ 11, మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి. ఈ యేడాది పొడుగునా ఆ మహాత్ముడి ద్విశత జయంతి సంబరాలు దేశవ్యాప్తంగా జరగనున్నాయి. భారతదేశపు సాంస్కృతిక పునరుజ్జీవన పతాకగా పేరుగాంచిన ఆ మహనీయుడు జన్మించి రెండు వందల యేళ్లు కావస్తున్నా.. నేటికీ ఆయన జీవితం గురించి, ఆయన చేపట్టిన ఉద్యమాల గురించీ దేశ ప్రజలలో ప్రచారం తక్కువగానే ఉన్నది. వాస్తవానికి గత నలభై, యాభై యేళ్ల నుంచే పూలే గురించి దేశవ్యాప్తంగా చెప్పుకోదగ్గ ప్రచారం మొదలైందని చెప్పాలి. అంతకు మునుపు ఆయన ఉనికిని కాలరాసే ప్రయత్నాలు సాగినవి. మూఢాచారాలనీ, మనువాద భావజాలాన్నీ తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్న ఆధిపత్య శక్తులు.. తమకు వ్యతిరేకంగా ప్రజల్లో ప్రచారం చేసిన వారి నోరునొక్కడమో.. వారి చరిత్రను కనుమరుగు చేసే కుట్రలు పన్నడమో చేశాయి. తెలుగునాట.. మూఢాచారాలను, బ్రాహ్మణ భావ జాలాన్నీ తన కవితలతో ప్రశ్నించిన వేమన చరిత్రను.. రెండువందల యేళ్ల పాటు మట్టిలో కప్పివేస్తే.. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అనే విదేశీ దొర పుణ్యాన.. ఆ సామాజిక విప్లవమూర్తి చరిత్ర, ఆయన కవితా సంపద మళ్లీ మనకు దక్కింది. పూలే విషయంలోనూ అదే తరహా అన్యాయం జరిగింది. మహాత్మా పూలే లోకమాన్య బాల గంగాధర తిలకులిద్దరూ సమకాలీకులే. ఇద్దరూ మహారాష్ట్రలోని పూణే నగరవాసులే. పూలేనేమో.. మనుషులం దరూ సమానులేనని వాదించిన ప్రగతిశీల వాది కాగా.. 'లోకమాన్యుడు' మాత్రం అసమానతల చాతుర్వర్ణ వ్యవస్థ బరాబర్ కొనసాగాల్సిందేనని పట్టుబట్టిన నికార్సైన ఛాందసవాది. "స్వరాజ్యం నా జన్మహక్కు" అని గొప్పగా నినదించిన ఆ పెద్దమనిషి.. ఆ స్వరాజ్యంపై హక్కు, సమాజంలోని కొన్ని వర్గాల వారిదేనని సైతం వాదించడం చారిత్రక విషాదం. అలాంటి బాలగంగాధర్ తిలక్.. మనందరి హైస్కూల్ పాఠ్యపుస్తకాలలో కొలువుదీరాడు. సమసమాజం కోసం ఉద్యమించిన పూలే ప్రస్తావన.. నేటికీ పాఠ్యాంశాలలో చోటు దక్కించుకోలేదు! భారతీయ సమాజాన్ని మానవతా విలువల పునాదులపై నిర్మించడానికి గతంలో ఎందరో మహనీయులు కృషి చేశారు. నేడు కొందరు అమాయకంగా భారతదేశంలో సనాతన ధర్మమంటే బ్రాహ్మణ ధర్మమే అని అనుకుంటారు. నిజానికి.. కణాదుడు, అజితకేశ కంబళుడు, చార్వాకులు, లోకాయతులు, జైనులు, బుద్ధుడూ.. ప్రవచించిన సమతాధర్మమే ఈ దేశపు గడ్డపై సనాతన ధర్మం! పాశ్చాత్య నాగరికతలో గ్రీకు దేశానికి చెందిన ప్లేటోని హేతువాద పితామహుడిగా పేర్కొంటారు. ఆ ప్లేటో బతికిన కాలానికి 200 సంవత్సరాలకు ముందే.. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దిలో.. మనగడ్డపై అజిత కేశ కంబళుడు హేతువాదాన్ని, సమతావాదాన్ని ప్రచారం చేసి.. పురోహిత వర్గం ప్రచారం చేస్తున్న మూఢా చారాలను బహిరంగంగా సవాల్ చేశాడు. ఆధునిక యుగంలో ఆ సమతావాద సంస్కృతికి మళ్లీ జీవం పోసి.. ఇంగ్లీషు విద్య వెలుగులో కుల విషవృక్షాన్ని సమూలచ్ఛేదం చేయడానికి మహోన్నత ఉద్యమం నడిపి మహాత్ముడై నిలిచినవాడు జ్యోతిబా పూలే. ఆధిపత్యవర్గాలు తమ దోపిడీ విధానాలకు సామాన్య ప్రజల సమ్మతిని రాబట్టడం కోసమే కృత్రిమంగా చాతుర్వర్ణ వ్యవస్థను సృష్టించారు. అందులో.. దోపిడీ చేసేవారికి పై స్థానాలను అంటగట్టి, సంపద సృష్టికర్తలైన శ్రామిక వర్గాలకు శూద్రులు, అతిశూద్రులు అనే పేర్లను తగిలించారు. ఆధిపత్య వర్గాల దురాగతాలను నిరోధించడానికి, శ్రామికవర్గ ప్రజలలో చైతన్యం తీసుకురా వడానికి.. పూలే 1873 సెప్టెంబరు 24న 'సత్య శోధక్ సమాజ్' సంస్థను స్థాపించాడు. నిమ్నవర్గాల ప్రజలను కులదోపిడీ నుంచి విముక్తి చేయడంతోపాటు రైతులు, కూలీలను హక్కులకోసం సంఘటితపరిచేందుకు ఈ సంస్థ ద్వారా పూలే విశేషంగా కృషి చేశాడు. విద్యాజ్ఞానాలను అందుకోవడం ద్వారానే శూద్ర, అతిశూద్రులు తమ హక్కులను నిలబెట్టుకోగలరని గుర్తించి వారిలో విద్యావ్యాప్తి కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పరచాడు. దళిత వర్గాల స్త్రీలకు సైతం విద్య అందాలనే ఉద్దేశంతో వారి కోసం ప్రత్యేక పాఠశాలల నెలకొల్పాడు. దళిత స్త్రీలకు చదువు చెప్పడానికి అగ్రవర్ణాల స్త్రీలు ముందుకురాని పరిస్థితుల్లో తన భార్య సావిత్రీబాయికి తాను చదువు నేర్పి, ఉపాధ్యాయినిగా తీర్చిదిద్ది ఆమెచేత దళిత స్త్రీలకు చదువు చెప్పించాడు. సత్యశోధక సమాజ్ సభ్యుడైన నారాయణ మేఘాజీ లొఖాండే బంబాయిలోని మిల్లు కార్మికుల పోరాటాలకు నాయకత్వం వహించారు. భారత కార్మికులకు ఆదివారం సెలవు దినం, మధ్యాహ్న భోజన విరామం రావడం గనక లొఖాండే కృషి ఎంతో ఉన్నది. విగ్రహారాధనను, కుల వ్యవస్థను, వేదాల పవిత్రతను ప్రశ్నించాలని పూలే ప్రజలకు ఉద్బోధించేవాడు. మూఢా చారాలను ఖండిస్తూ ప్రజల్లో హేతువాద ధోరణులను పెంపొందింపజేయడానికి సత్య శోధక్ సమాజ్ సభ్యులు పాటుపడ్డారు. భగవంతునికి, భక్తునికి మధ్య అనుసంధాన కర్తగా పురోహితవర్గం ఉండాల్సిన అవసరమే లేదని పూలే వాదించేవాడు. పురాణాలు, వేదాలు దైవదత్తమైనవి కావని, మనుషులు రాసినవేనని, నేటికాలానికి అనుగుణంగా వాటిల్లో మార్పులు కూడా చేసుకోవచ్చని వాదించేవాడు. కొందరు స్వార్థపరుల వికృత ఆలోచనల్లోంచే కులవ్యవస్థ ఆవిర్భవించింది తప్ప భగవంతుడు సృష్టించింది కానేకాదని ఆయన తన సభల్లో వివరించేవాడు. పక్షుల్లో, జంతువుల్లో లేని కుల భేదాలు మానవుల్లో ఎందుకున్నాయని అగ్రవర్ణాల పండితులను ఆయన నిలదీసేవాడు.

# విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగులకు APSEB సర్వీస్ రూల్స్ అమలు చేయాలి





**దేవరకొండ ఏప్రిల్ 10 ( మహాప్రభ )**
విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగులకు APSEB సర్వీస్ రూల్స్ అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కొండమల్లెపల్లి పట్టణంలో కరెంటు ఆఫీసు కార్యాలయం వద్ద నిర్వహించిన విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగుల సమ్మెకు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......2026 వేతన సవరణ అమలు చేయాలి ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపడుతూ విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగుల న్యాయమైన కోరికలను అమలు చేయాలి ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది అని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి ఆయన డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎంపీ రెడ్డి,విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# యోగా ద్వారా ఆరోగ్యం-ఒత్తిడి నివారణ సాధ్యం

**- మంత్రి దామోదర్ రాజనర్సింహ**





**హైదరాబాద్ ఏప్రిల్ 10(మహాప్రభ)**
యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా అధిగమించవచ్చని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ సందర్భంగా శనివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమానికి ఆయన రహదారులు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా సమగ్ర పరిష్కారమని పేర్కొన్నారు. యోగా సాధనను నిత్యజీవితంలో భాగంగా చేసుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జీవనశైలి సంబంధిత వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. యోగా కేవలం వ్యాయామ విధానం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలి అని, దీన్ని ప్రతిరోజూ ఆచరించడం ద్వారా శరీరానికి దృఢత్వం, మనసుకు ప్రశాంతత లభిస్తాయని వివరించారు. అలాగే యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. మానసిక ప్రశాంతత కలగడం వల్ల వ్యక్తిగత స్థాయిలోనే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. జిల్లాలో యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని, ముఖ్యంగా విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు పెంచడం అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి క్రిస్టినా చోగ్తూ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కే. లలితాదేవి, హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డా. వెంకటి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. షీబా హయత్, డా. పూనం, డిపిఓ అక్రమ్ తదితర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యోగా తరగతి నిర్వహణ





**కామారెడ్డి ఏప్రిల్ 10 (మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న లి"ప్రజా ప్రణాళిక -- ప్రగతి పాలన 99 రోజుల కార్యాచరణ"లిలో భాగంగా, హోమియోపతి డ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి జిల్లా యోగ కేంద్రంలో యోగా తరగతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (DM&HO) అధ్యక్షత వహించగా, =ణా ^. ఎ. గిరి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా స్థాయి అధికారులు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రగతి పాలన అనేది కేవలం మౌలిక సదుపాయాల అభివృద్ధి మాత్రమే కాకుండా ప్రజల ఆరోగ్యాభివృద్ధి కూడా. ఆయుష్ వైద్యం, యోగా మన సంస్కృతిలో అంతర్భాగం. వీటిని ప్రతి ఇంటికి చేర్చే బాధ్యత ఆరోగ్య శాఖపై ఉంది" అని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆయుష్ వైద్య విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. యోగా, ఆయుర్వేదం, హోమియోపతి వంటి సంప్రదాయ వైద్య పద్ధతులు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు జీవనశైలిని మెరుగుపరుస్తాయని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మెగా ఆయుష్ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సులభంగా వైద్య సేవలు అందించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. ప్రజలందరూ యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ణవీడనూ మాట్లాడుతూ, ఆయుష్ వైద్య విధానాల్లో హోమియోపతి, ఆయుర్వేదం, యునాని వైద్యాల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా జీవనశైలి వ్యాధులు (చీజణం) నివారణలో యోగా, ప్రాణాయామం కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.అనంతరం ఆయుష్ విభాగం యోగా ఇన్‌స్ట్రక్టర్ ఆధ్వర్యంలో 45 నిమిషాలపాటు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఇందులో సూక్ష్మ వ్యాయామాలు, తాడాసనం, వృక్షాసనం, భుజంగాసనం వంటి యోగా ఆసనాలు, అనులోమ-విలోమ, భ్రామరీ ప్రాణాయామాలు మరియు ధ్యానం చేయించబడింది. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలపాటు యోగా చేయాలని, తమ పరిధిలో ప్రజలకు యోగా ప్రాముఖ్యతను తెలియజేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అహ్మద్‌నగర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**





**దుబ్బాక - ఏప్రిల్ 10 (మహాప్రభ )**
సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని అహ్మద్ నగర్ గ్రామంలో బి ఆర్ ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం గ్రామంలోని సిసి డ్రైనేజీ పాఠశాల ప్రహరీ గోడ మరియు అంగన్వాడి భవనాన్ని పరిశీలించిన దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్, అలాగే అసంపూర్తిగా నిలిచిపోయిన గ్రామపంచాయతీ భవనం పనులను పరిశీలించి, పనులు త్వరితగతిగా పూర్తిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారితో ఫోన్లో మాట్లాడి భవనం పూర్తి చేయడానికి అదనంగా రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచ్ లు, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

-నేరాల నివారణకు ముందస్తు నిఘా అవసరం
-నైట్ పెట్రోలింగ్ ముమ్మరం..
అప్రమత్తతే నేరాల నివారణకు ఆయుధం
-ప్రజల విశ్వాసమే లక్ష్యంగా పనిచేయాలి
- పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ దిశానిర్దేశం



**కామారెడ్డి ఏప్రిల్ 10 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఐపిఎస్ , శుక్రవారం రోజున బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది హాజరు (రోల్ కాల్), వారి క్రమశిక్షణ మరియు సమయపాలనను స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తాను చెబుతున్న సూచనలు సిబ్బందికి ఏ మేరకు అర్థమయ్యాయో కూడా స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులు మరియు ఫిర్యాదుదారుల పట్ల మానవీయ కోణంలో గౌరవంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని త్వరితగతిన పరిష్కరించడం ద్వారా పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాలని ఎస్పీ గారు కోరారు. ప్రజల ఫిర్యాదుల పట్ల వేగంగా స్పందించి పరిష్కార దిశగా పనిచేయాలని స్పష్టం చేశారు. చివరగా, జిల్లాలో ఇటీవల జరుగుతున్న ఆస్తి సంబంధిత నేరాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయాల్లో నిరంతర పెట్రోలింగ్, గస్తీ పెంచాలని, అనుమానితులపై నిశిత నిఘా ఉంచాలని బాన్సువాడ ఎస్.హెచ్.ఓ ని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడరాదని, ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డిఎస్పీ విఠల్ రెడ్డి, ఎస్.హెచ్.ఓ శ్రీధర్, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పులిజాల నర్సింహా మృతి బాధాకరం

-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ ఏప్రిల్ 10( మహాప్రభ)**
దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ పులిజాల జానీ తండ్రి పులిజాల నర్సింహా మృతి బాధాకరం అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు . శుక్రవారం దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో నర్సింహ మృత దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... నర్సింహ మృతి పార్టీకి లోటు అని ఆయన అన్నారు. నర్సింహా ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆయన భగవంతుని ప్రార్థించారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎంచీ రెడ్డి, కౌన్సిలర్ పొట్ట మధు, పగిడిమర్రి సతీష్,పగిడిమర్రి నాగరాజు, తదితరులు ఉన్నారు.

# రామయంపేట బస్టాండ్ తీరు ఇంతేనా?

- లైట్లు లేక అంధకారంలో ప్రయాణికుల అవస్థలు
- నాన్ స్టాప్ బస్సులతో తిప్పలు
- కనీసం బస్టాండ్ కు పేరు లేని వైనం
- పట్టించుకోని పాలకులు








**రామాయంపేట, ఏప్రిల్ 10: మహాప్రభ**
రాష్ట్రంలోనే కీలక ప్రాంతంగా పేరున్న రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్, నేడు సమస్యల వలయంలో చిక్కుకుంది. ఒకప్పుడు ప్రయాణికుల రాకపోకలతో కళకళలాడిన ఈ ప్రాంతం, నేడు అధికారుల ఉదాసీనత, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. సాయంత్రం ఆరు దాటితే చాలు అడుగు తీసి అడుగు వేయడానికి భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వీధి దీపాలు లేక, కనీసం బస్టాండ్ అనే నామఫలకం లేక, బస్సులు లోపలికి రాక ప్రయాణికులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. అభివృద్ధి మాటల్లో తప్ప చేతల్లో కనిపించడం లేదని సామాన్య జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**లైట్లు లేక అంధకారంలో ప్రయాణికుల అవస్థలు**
బస్టాండ్‌లో కరెంటు లైట్లు లేకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది. చీకటి పడిందంటే చాలు బస్టాండ్ ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మధ్యకాలంలో దొంగతనాలు పెరగడం ప్రయాణికులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అదును చూసి దొంగలు చేతివాటం ప్రదర్శించే అవకాశం ఉంది. మున్సిపల్ పాలకవర్గం వెంటనే స్పందించి బస్టాండ్ లో లట్లు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో సామాన్యుల భద్రత గాలిలో దీపంలా మారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాన్ స్టాప్ బస్సులతో తిప్పలు**
రామాయంపేట మీద గుండా వెళ్లే బస్సులు నాన్‌స్టాప్ పేరుతో ఊరిలోకి రాకుండానే వెళ్లిపోతున్నాయి. గతంలో ప్రతి బస్సు బస్టాండ్‌కు వచ్చి వెళ్లేది, కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. ఏదైనా అత్యవసర పని మీద హైదరాబాద్ వెళ్లి తిరిగి వచ్చే ప్రయాణికులు రాత్రి వేళల్లో ఊరి బయట దిగాల్సి వస్తోంది. ముఖ్యంగా సెలవులపై వచ్చే విద్యార్థులు చీకటి సమయంలో ఒంటరిగా గ్రామంలోకి రావాలంటే భయం గుప్పిట్లో నడవాల్సి వస్తోంది. కండక్టర్లను అడిగితే ఇక్కడ స్టాప్ లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతుండటంతో ప్రయాణికులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

**కనీసం బస్టాండ్ కు పేరు లేని వైనం**
ఒక ఊరికి గుర్తింపునిచ్చేది బస్టాండ్, కానీ రామాయంపేట బస్టాండ్‌కు కనీసం పేరు కూడా లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొత్తగా ఈ ప్రాంతానికి వచ్చేవారు బస్టాండ్ ఎక్కడ ఉందో తెలియక అయోమయానికి గురవుతున్నారు. తెల్లవారుజామున బస్సు కోసం వెళ్లే వారు రోడ్డుపై వెళ్లే ప్రజలను ఆపి బస్టాండ్ ఎక్కడ అని అడగాల్సిన దుస్థితి నెలకొంది. ఒక మండల కేంద్రంలో, మున్సిపాలిటీలో కనీసం బస్టాండ్ బోర్డు లేకపోవడం అధికారుల పనితీరుకు పరాకాష్టగా మారింది.

**-పట్టించుకోని పాలకులు**
ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చే నాయకులు ఇప్పుడు కనీస సౌకర్యాల కల్పనలో విఫలమయ్యారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రామాయంపేట నాయకులు, మున్సిపల్ అధికారులు మొద్దు నిద్ర వీడి బస్టాండ్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే బస్టాండ్ పేరుతో బోర్డును ఏర్పాటు చేసి, అన్ని బస్సులు లోపలికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పాపన్నపేట ముదిరాజ్ నాయకుల ముందస్తు అరెస్ట్



**పాపన్నపేట,10 ఏప్రిల్, ( మహా ప్రభ )**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ముదిరాజుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పాపన్నపేట మండల ముదిరాజ్ నాయకులను శుక్రవారం పాపన్నపేట పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, ముదిరాజులను బీసీ-డీ నుండి బీసీ-ఏ లోకి చేరుస్తామన్న ఎన్నికల హామీని తుంగలో తొక్కడం అన్యాయమన్నారు. గాంధీ భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన ముదిరాజ్ నాయకులను, ముదిరాజ్ ప్రజలను రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముదిరాజ్ హక్కుల కోసం పోరాడుతుంటే అక్రమ అరెస్టులతో అణిచివేయాలని చూడటం అప్రజాస్వామికమని అన్నారు. జనాభా దామాషా ప్రకారం ముదిరాజులకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు కొత్తూరి శ్రీనివాస్ ముదిరాజ్, పుట్టి కిరణ్ ముదిరాజ్ కుర్తివాడ, దుర్గయ్య ముదిరాజ్, దారబోయిన మల్లేశం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కి అర్జీలు కరువు ..!



**పాపన్నపేట, ఏప్రిల్ 10 ( మహాప్రభ )**
మండల కేంద్రం పాపన్నపేటలో ప్రతి సోమవారం జరుగుతున్న ప్రజావాణి కి అర్జీ దారులు కరువయ్యారు. యథావిధిగా సమస్యల పరిష్కారానికి అర్జీదారులు మెదక్ జిల్లా కేంద్రానికి తరలి వెళ్ళి దరఖాస్తులు సమర్పిస్తున్నారు. వివిధ శాఖల నుండి అధికారులు ప్రజావాణికి హాజరవుతున్న అధికారులు గ్రామ స్థాయిలో తెలిసేలా చర్యలు తీసుకోలేదని గ్రామాల ప్రజల నుండి విమర్శలు ఉన్నాయి. జిల్లాలో అతి పెద్ద మండలమైనా పాపన్నపేటలో ఆర్జీలు మాత్రం ఒకటి లేదా రెండు రావడం శోచనీయం.

# జిల్లా ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

-అరైవ్ అలైవ్ వీక్' కార్యక్రమం విజయవంతం చేద్దాం
- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్..



**మెదక్ జిల్లా -10ఏప్రిల్ (మహాప్రభ )**
రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న “అరైవ్ అలైవ్ వీక్” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని ఎస్పీ తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజలు చురుకుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన 8--9 మంది సభ్యులతో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. రిటైర్డ్ టీచర్లు, వైద్యులు, ఆశా/అంగన్‌వాడీ సిబ్బంది, యువజన సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులను సభ్యులుగా చేర్చి, కనీసం ముగ్గురు మహిళలకు ప్రాధాన్యం ఇస్తారు. రోడ్డు భద్రతపై ప్రమాణ స్వీకారం నిర్వహించి, గుంతలు పూడ్చడం, ఓపెన్ వెల్స్ మూసివేయడం, పొదలు తొలగించడం వంటి చర్యలు చేపడతారు. అవగాహన కోసం వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయనున్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించేందుకు ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే జంక్షన్లను గుర్తించి జీబ్రా క్రాసింగ్‌లు, లేన్ మార్కింగ్‌లు పునరుద్ధరిస్తారు. బ్లాక్ స్పాట్స్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, వార్నింగ్ బోర్డులు, లైటింగ్ మెరుగుదల చేపడతారు.విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, సురక్షిత రోడ్డు దాటే విధానంపై ప్రదర్శనలు నిర్వహిస్తారు. స్కూల్ ప్రాంగణాల్లో వార్నింగ్ బోర్డులు ఏర్పాటు చేసి హ్యూమన్ చైన్ కార్యక్రమాలు చేపడతారు. పిల్లల ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.సోషల్ మీడియా ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం చేపడతారు. డ్రైవర్ల లైసెన్సులు, వాహన పత్రాలు తనిఖీ చేసి ఆటో రిక్షాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తారు. ఓవర్లోడింగ్, నిర్లక్ష్య డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటారు. రోడ్డు ప్రమాదాల సమయంలో అత్యవసర స్పందనపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. పోలీస్, అంబులెన్స్ సిబ్బంది, వాలంటీర్లకు ఫస్ట్ ఎయిడ్, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తారు.ట్రాఫిక్ ఉల్లంఘనదారులకు జరిమానాల బదులు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. స్కూల్ బస్సుల భద్రత తనిఖీలు చేసి, స్కూల్ జోన్‌లలో జీబ్రా క్రాసింగ్‌లు, సూచికలు ఏర్పాటు చేస్తారు. “స్లో డౌన్ -- స్కూల్ జోన్” వంటి హెచ్చరికల ద్వారా విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే జిల్లా ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. “స్పీడ్ తగ్గించు -- జీవితం కాపాడు”, “జాగ్రత్తగా నడపు -- సురక్షితంగా చేరుకో” అనే సందేశంతో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# కలెక్టరేట్ రహదారి సమీపంలో సానిటేషన్‌పై జిల్లా కలెక్టర్ ఆకస్మిక పరిశీలన



**కామారెడ్డి ఏప్రిల్ 10 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, కలెక్టరేట్ రహదారి సమీపంలో శానిటేషన్ పరిస్థితులను శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల్లో శుభ్రత, చెత్త నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. రోడ్డు పక్కన చెత్త , నీటి నిల్వలు వంటి తదితర వాటిని పరిశీలించి సంబంధిత మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు సానిటేషన్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిరంతర శుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా, పట్టణ పరిసరాల్లో పారిశుధ్యాన్ని కచ్చితంగా నిర్వహించడం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. స్వచ్ఛమైన వాతావరణం కోసం అధికారులు సమన్వయము తో కలిసి పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ



**శివంపేట, ఏప్రిల్ 10 (మహాప్రభ):**
శివంపేట మండలం దంతాన్పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ గజేంద్రుల మమత నర్సింలు పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. వార్షిక పరీక్షలను పురస్కరించుకుని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. విద్యార్థులు రాబోయే త్రైమాసిక పరీక్షలకు సన్నద్ధమవ్వాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని వారు కోరారు.

## పిల్లుట్ల లో 'పోషణ్ పఖ్వాడా '





**శివంపేట, ఏప్రిల్ 10 (మహా ప్రభ):**
శివంపేట మండలం పరిధిలోని పిల్లుట్ల గ్రామం లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ్ పఖ్వాడా' కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు బుర్ర మురళి గౌడ్ పాఠశాలల్లో చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం ప్రాధాన్యతను వివరించారు. అంగన్‌వాడీ టీచర్ కమ్మరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, వార్డు సభ్యులు పిల్లి మధు, డాక్టర్ శైలేంద్ర, సతీష్ పాల్గొన్నారు.

## చిన్నారికి ఆర్థిక సాయం అందజేసిన జాలే నరసింహారెడ్డి



**దేవరకొండ ఏప్రిల్ 10 ( మహాప్రభ )**
స్థానిక దేవరకొండ జంగాలకాలనీ కి చెందిన ప్రవీణ్ కుమార్ కూతురు దువ్వ భావన 5 సంవత్సరాలు అనే చిన్నారి కి గత 15 రోజుల క్రితం ఆపేండెక్స్ ఆపరేషన్ చేయడం జరిగింది. కడుపులో మొత్తం ఇన్ఫెక్షన్ అవ్వడం తో పేగు బయటికి పెట్టడం జరిగింది. చిన్నారికి ఖర్చుతో కూడుకున్న వైద్యం కావడంతో పాప తండ్రి ప్రవీణ్ కుమార్ జాలే నరసింహ రెడ్డి సాయం కోసం వారి ఆఫీసుకు వెళ్లి చిన్నారి పరిస్థితిని తెలిపి వారిని సహాయం కోరగా 10 వేల రూపాయలు సహాయం అందించారు ఆపదలో ఉన్న తమను ఆదుకున్నందుకు ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులు జాలా నరసింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే స్పందనతో లబ్దిదారులకు న్యాయం చెక్కుల పంపిణీ



**గాంధారి, ఏప్రిల్ 10 మహాప్రభ**
గాంధారి మండలం సర్వాపూర్ గ్రామంలో గత ప్రభుత్వ బీఆర్ఎస్ హయాంలో 2 (బి హెచ్ కె) ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించడంతో,లబ్ధిదారులు అప్పులు చేసి ఇళ్లను నిర్మించుకున్నారు. అయితే నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా బిల్లులు మంజూరు కాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు అధికారులను సంప్రదించినప్పటికీ ఎటువంటి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు తమ సమస్యను ఎమ్మెల్యే మదన్ మోహన్, తెలియజేయగా, ఆయన వెంటనే స్పందించి హౌసింగ్ శాఖ అధికారులతో మాట్లాడి పెండింగ్ బిల్లులను మంజూరు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ మోహన్, చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# అభివృద్ధిలో మహిళలను భాగస్వాములను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**-రేషన్ కార్డు కలిగిన ఇంటి యాజమానికి జూన్ 02 తేది నాటి నుండి 5 లక్షల రూపాయల ప్రమాద భీమా పథకం ప్రారంభం.**
**-మహిళా సాధికారతే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.**
**-దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్**



**దేవరకొండ ఏప్రిల్ 10 ( మహాప్రభ )**
దేవరకొండ నియోజకవర్గం లోని పీఏ పల్లి లి ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాలలో మౌలిక సదుపాయల కల్పనపై మండల స్థాయి అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించిన శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ అంగడిపేట గ్రామ స్టేజ్ వద్ద 100 ఓల్టేజ్ ట్రాన్స్ఫరామ్ ను ప్రారంభించారు. పిఏ పల్లి మండలానికి సంబందించిన 25 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి 100116/- రూపాయల చొప్పున స్వయంగా పంపిణీ చేశారు . మహాలక్ష్మి ఉచిత బస్సు పథకంలో భాగంగా టీజీఎస్ఆర్‌టీసీ TGSRTC) బస్సుల్లో మహిళలు 2.65 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చేయడం గర్వకారణం అన్నారు. రాష్ట్రంలో ఈ పథకం ద్వారా దాదాపు 10,000 కోట్ల ప్రయాణ భారం తగ్గి, అది నేరుగా కుటుంబాల పొదుపుగా మారింది అని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిని సమగ్రంగా పరిశీలించి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచించాను. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా, ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు మన ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కాలానికి దృష్టిలో పెట్టుకొని గ్రామ ప్రజలకు త్రాగునీరు సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సూచించారు. గ్రామ పంచాయతీ లో ఉన్న బడ్జెట్ అత్యవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని పంచాయతీ కార్యదర్శిలకు,సర్పంచులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి , తహసీల్దార్ జయశ్రీ , అన్ని విభాగాల అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు మూడవ రోజు ఆర్టిజన్ల నిరవధిక సమ్మె



**మెదక్ జిల్లా -10ఏప్రిల్ (ప్రభప్రభ )**
విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు మూడవ రోజైన శుక్రవారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టి వీఏఈ జెఏసి) పిలుపు మేరకు ఆర్టిజన్లు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టిజన్ లు మాట్లాడుతూ ఆర్టిజన్లకు నిబంధనల ప్రకారం ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని,2026 పిఆర్సి,మెడికల్ లీవులు మంజూరు,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.గ్రేడ్ చేంజ్ పీస్ రేటు కార్మికులకు,అన్ మ్యాన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పోల్ టు పోల్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు.వినియోగదారులకు 24గంటలు నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నా,తాము మాత్రం చాలీ చాలని జీతంతో జీవితాలను నెట్టు కొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనారాష్ట్ర ప్రభుత్వం,యాజమాన్యం కల్పించుకుని తమకు రావాల్సిన న్యాయ పరమైన హక్కులను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఆర్టిజన్ల సమ్మెకు మద్దతుగా సిపిఎం పార్టీ జిల్లా అధ్యక్షురాలు బలమని హాజరై మాట్లాడుతూ ఆర్టిజన్ల సమ్మె న్యాయ పరమైనదేనని,వారికి పూర్తి హక్కులు కల్పించేవరకు పోరాటం ఆగదన్నారు. యాజమాన్యం రాష్ట్ర జెఏసి నాయకులతో చర్చించిన తర్వాతనే సమ్మె ఎత్తివేసి విధులకు హాజరవుతున్నారు. సిపిఎంపార్టీ పక్షాన ఆర్టిజన్లకు పూర్తి మద్దతు కల్పిస్తామన్నారు.మన యూనియన్ ఏపిలుపు ఇచ్చినప్పటికీ అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. అందరూ ఆర్టిజన్లు ఎన్ని రోజుల సమ్మెకైన సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆ ఈకార్యక్రమంలో మహిళా ఆర్టిజన్లు ప్రణీత,స్వప్న, జ్యోతి,సుమలత, మానస,నాగమణి జెఏసి నాయకులు జంగం శరత్, పృథ్వీ గౌడ్,శ్రీశైలం,ప్రదీప్ గౌడ్, శ్రీనివాస్ ,నాగరాజు,రమావత్ హరినాయక్, పోలశ్రీనివాస్, ఉపేందర్,వెంకట చారి,బి. చంద్ర భానప్ప,సోమ శేఖర్ ,మొగులయ్య,రాజు గౌడ్,మోహన్,బాబునాయక్, శంకరప్ప,పరశురామ్, నర్సింలు,సుధాకర్, సాయిలు,యాదగిరి,సూర్య రమేష్,శ్రీనివాస్ రెడ్డి,ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. మూడవ రోజు డివిజన్ కార్యాలయం ముందు కార్మికుల వంటా వార్పు కార్యక్రమం కొనసాగింది.

# రైతుల సంక్షేమమే - ప్రభుత్వ ధ్యేయం

**-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**
**-విత్తనము నాటి, కలుపు తీసి పంట కోయడమే కాదు,**
**ఆ పంట "కొనుగోలు శక్తి"గాను మారింది మన తెలంగాణ ఆడబిడ్డలే..**



**దేవరకొండ ఏప్రిల్ 10 ( మహాప్రభ**
దేవరకొండ నియోజకవర్గం లోని గుడిపల్లిలి మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామాలలో మౌలిక సదుపాయల కల్పనపై మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ గ్రామాల్లో తాగునీటి సరఫరా పై తాజా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నాను. తాగునీటిని వృధా చేయకుండా, జాగ్రత్తగా నీటిని వినియోగించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రానున్న రెండు నెలలు అత్యంత కీలకమైనందున అప్పటి వరకు ఎక్కడా నీటి కొరత రాకుండా చూడాలని ఆదేశించారు.ఉపాధి హామీ పనుల్లో 40 మంది కూలీలకు ఒక్క మెట్ ను నియమించుకోవాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ లేని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాలని అన్నారు అభివృద్ధి పనులలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు. సెంటు భూమి లేకున్నా రేషన్ కార్డు ఉంటే చాలు ప్రమాద బీమా. ఉపయోగపడుతుందన్నారు. రేషన్ కార్డు కలిగిన ఇంటి యాజమాని ప్రమాదశాత్తుతో మరణిస్తే వారి కుటుంబానికి ఆదుకోవడానికి జూన్ 2వ తేదీ నాటి నుండి 5లక్షల రూపాయల ప్రమాద భీమా పథకం ప్రారంభం ఉపయోగపడుతుందన్నారు. బారిన పడకుండా, రైతులు మద్దతు ధర పొందేలా ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని వారు సూచించారు.రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో పడతాయని, సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని, క్వింటాలుకు రూ.2,389 మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం, రైతుల బాధలు తెలిసిన ప్రభుత్వమని గతంలో మాదిరిగా తాళ్ల పేరుతో ధాన్యంలో కోతలు పెట్టొద్దని సూచించారు. గుడిపల్లి మండలానికి సంబందించిన కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగింది.గుడిపల్లి మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రజా ప్రతినిధులు మరియు సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అండాలు, తహసీల్దార్ ధీవేనమధువాసిని , మండల స్థాయి అధికారులు, మండల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ ప్రహరీ గోడను పరిశీలించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**దుబ్బాక - ఏప్రిల్ 10( మహాప్రభ )**
సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని లింగరాజు పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడను దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు, గ్రామ అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగించేందుకు తాము కట్టుబడి ఉంటాం అని తెలిపారు.గ్రామంలో పెండింగ్లో ఉన్న గ్రామపంచాయతీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ, మహిళా సంఘం భవనాన్ని త్వరలోనే నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరించడమే తమ సంకల్పమని దుబ్బాక ఎమ్మెల్యే స్పర్శన్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల అధ్యక్షులు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామీణ అభివృద్ధికి కొత్త దిశ ప్రజలతో కలిసి ముందుకు సాగుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి...



**దుబ్బాక - ఏప్రిల్ 10 (మహాప్రభ)**
దౌల్తాబాద్ మండల పరిధిలోని అహ్మద్ నగర్ , లింగరాజు పల్లి , కోనాయిపల్లి , గోవిందా పూర్, పోసాన్ పల్లి , గువ్వలేగి , ఉప్పరపల్లి, మరియు దౌల్తాబాద్ గ్రామాలలోని సిసి రోడ్లు, పాఠశాల 16 గోడల నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి తమ లక్ష్యమని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సిసి రోడ్లు, పాఠశాల అభివృద్ధి, మహిళా సంఘం భవనాలు, మరియు అంగన్వాడి కేంద్రాల్లో నిర్మాణంతో గ్రామాల్లో సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. మహిళా సాధికరాతకు ప్రాధాన్యత ఇస్తూ మహిళ సంఘ భవనాల నిర్మాణం చేపడుతున్నామని. చిన్నారుల అభివృద్ధి కోసం అంగన్వాడి భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్దిష్ట కాల పరిమితిలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సహకారంతో గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# బిజినెస్

## మళ్లీ లాభాల్లోకి స్టాక్ మార్కెట్లు.. 918 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్



ఒకరోజు విరామానికి తెరదించుతూ దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మళ్లీ లాభాల బాటపట్టాయి. పశ్చిమాసియా లో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనిస్తున్నప్పటికీ.. దేశీయంగా కొనుగోళ్ల మద్దతు కొనసాగడంతో సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 918.6 పాయింట్లు పెరిగి 77,550.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 275.5 పాయింట్లు లాభపడి 24,050.6 వద్ద ముగిసింది.ట్రేడింగ్‌లో ఒక దశలో సెన్సెక్స్ 77,622.50, నిఫ్టీ 24,074.05 వద్ద ఇంట్రాడే గరిష్ఠాలను తాకాయి. ఏషియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్, బజాజ్ ఆటో, శ్రీరామ్ ఫైనాన్స్ వంటి హెవీ వెయిట్ షేర్లు లాభపడటం సూచీల పెరుగుదలకు దోహదపడింది. బెంచ్‌మార్క్ సూచీలను మించి బ్రాడర్ మార్కెట్లు రాణించడం గమనార్హం. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.48 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.67 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే మిశ్రమ ప్రదర్శన కనబరిచాయి. ఐటీ షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి పెరగడంతో నిఫ్టీ ఐటీ సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. మరోవైపు నిఫ్టీ ఆటో, బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు మిగిలిన వాటితో పోలిస్తే వెనుకబడ్డాయి. ఉదయం సెషన్ ప్రారంభంలో కూడా ప్రపంచ మార్కెట్ల సానుకూల సంకేతాలతో సూచీలు లాభాలతోనే మొదలయ్యాయి.

## ఆకాశాన్నంటుతున్న బంగారం,వెండి ధరలు



బంగారం ధరలు మళ్లీ చుక్కలు చూపిస్తున్నాయి. గత కొంత కాలంగా సైలెంట్ గా ఉన్న ధరలు మళ్లీ పైకి ఎగబాకుతున్నాయి. ఏప్రిల్ 10 శుక్రవారం బంగారం వెండి ధరలు మళ్లీ పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1,520 పెరిగి రూ.1,53,000 పలుకుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1,400 పెరిగి రూ.1,40,250 పలుకుతోంది. వెండిధర కేజీకి రూ.5,000 పెరిగి రూ.2,65,000 చేరింది. దేశంలోని వివధ నగరాల్లో ఏప్రిల్ 10 శుక్రవారం బంగారం వెండిధరలను పరిశీలిస్తే.. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,150 వద్ద ట్రేడవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర రూ.1,40,400 పలుకుతోంది. ముంబై, కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం రూ.1,53,000 ఉంటే, 22 క్యారెట్ల బంగారం రూ.1,40,250 పలుకుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,090 వద్ద ట్రేడవుతోంది. అలాగే 22 క్యారెట్ల బంగారం రూ.1,41,250 పలుకుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,000 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,250 లు పలుకుతోంది. వెండి ధర కిలోకి రూ.2,65,000 గా కొనసాగుతోంది. ఈ ధరలు పెరగవచ్చు, తగ్గవచ్చు.. బంగారం కొనడానికి వెళ్లేముందు ధరలు మరోసారి చెక్‌చేసుకొని వెళ్తే మంచిది.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ ఈవీ బైకు.. ప్రారంభ ధర రూ.2.79 లక్షలు

**న్యూఢిల్లీ,**

ప్రముఖ స్పోర్ట్స్ బైకుల తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్..దేశీయ మార్కెట్లోకి తన తొలి ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫ్లైయింగ్ పీ సీ6 పేరుతో విడుదల చేసిన ఈ బైకు ప్రారంభ ధర రూ.2.79 లక్షలుగా నిర్ణయించింది. కానీ, బ్యాటరీ-యాస్-ఏ-సర్వీసెస్(బాస్) పద్ధతిన తీసుకుంటే ఈ మోటర్‌సైకిల్ ధర మాత్రం రూ.1.99 లక్షలు. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ స్పోర్ట్స్ బైకును విడుదల చేసినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.3.91 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ బైకు బ్యాటరీ సింగిల్ చార్జింగ్‌తో 154 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 3.7 సెకండ్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ బైకు గంటకు 115 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అలాగే 65 నిమిషాల్లోనే బ్యాటరీ 20 శాతం నుంచి 80 శాతం రీచార్జికానున్నది. ఈ బైకులో ఎల్‌ఈడీ లైటింగ్, గూగుల్ ఆధారంగా పనిచేసే నావిగేషన్, వైర్‌లెస్ ఫోన్ చార్జింగ్ సాకెట్, ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి ఫీచర్స్ ఉన్నాయి.




# స్పోర్ట్స్

## ధోనినే నా రోల్ మోడల్'..


### ముకుల్ చౌదరి కీలక వ్యాఖ్యలు

ఐపీఎల్ అంటేనే అనామక ఆటగాళ్లను రాత్రికి రాత్రే స్టార్లుగా మార్చే వేదిక. 2026 సీజన్‌లో అటువంటి ఒక అద్భుత సంచలనం నమోదైంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో కేకేఆర్ బౌలర్లను ఉతికి ఆరేసిన ముకుల్ చౌదరి ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ అయ్యాడు. కేవలం 27 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీతో లక్నో సూపర్ జెయింట్స్ కి అద్భుత విజయాన్ని అందించిన ఈ కుర్రాడి వెనుక ఒక స్ఫూర్తిదాయకమైన కథ ఉంది. ముకుల్ చౌదరి రాజస్థాన్‌లోని ఒక సాధారణ సైనిక కుటుంబం నుండి వచ్చాడు. అతని తండ్రి భారత సైన్యంలో జవాన్‌గా దేశ సేవ చేశారు. "పోరాటం నా రక్తంలోనే ఉంది" అని ముకుల్ గర్వంగా చెబుతుంటాడు. చిన్నప్పటి నుండి క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో పెరిగిన ముకుల్, తన తండ్రి నుండి మొండి పట్టుదలను నేర్చుకున్నాడు. మైదానంలో ఎంతటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా లొంగిపోకుండా పోరాడే గుణం అతనికి తన తండ్రి వల్లే వచ్చిందని మ్యాచ్ అనంతరం ముకుల్ భావోద్వేగంతో వెల్లడించాడు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ముకుల్ క్రీజులోకి వచ్చాడు. సునీల్ నరైన్, మిచెల్ స్టార్క్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను ఎదుర్కోవడం ఏమాత్రం సులభం కాదు. కానీ ముకుల్ ఏమాత్రం బెదరకుండా తన బ్యాట్‌కు పనిచెప్పాడు. మైదానం నలుమూలలా సిక్సర్ల వర్షం కురిపించాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో అతను ఆడిన తీరు చూస్తుంటే ఒక అనుభవం ఉన్న ఫినిషర్ ఆడుతున్నట్లుగా అనిపించింది. ముకుల్ చౌదరి ఎంఎస్ ధోనీకి వీరాభిమాని. "నేను చిన్నప్పటి నుండి ధోనీ భాయ్‌ని చూస్తూ పెరిగాను. మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లి ఎలా ముగించాలో ఆయనను చూసే నేర్చుకున్నాను. నా బ్యాటింగ్ స్టైల్‌లో కూడా ఆయన ప్రభావం ఉంటుంది" అని ముకుల్ పేర్కొన్నాడు. లక్నో జట్టు డైరెక్టర్ టామ్ మూడీ కూడా ముకుల్ బ్యాటింగ్‌ను మెచ్చుకుంటూ.. అతను జట్టుకు దొరికిన అసలైన ఆణిముత్యం అని కొనియాడారు. ముకుల్ ప్రయాణం అంత సులభంగా సాగలేదు. రాజస్థాన్ దేశవాళీ క్రికెట్‌లో నిలదొక్కుకోవడానికి అతను ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. కనీసం బ్యాట్ కొనుక్కోవడానికి కూడా ఇబ్బంది పడిన రోజులు ఉన్నాయని అతను గుర్తు చేసుకున్నాడు. అయితే తన ప్రతిభను గుర్తించిన లక్నో స్కౌట్స్, అతనికి ట్రయల్స్‌లో అవకాశం ఇచ్చారు. అక్కడ తన పవర్‌ఫుల్ హిట్టింగ్‌తో మెప్పించిన ముకుల్, ఇప్పుడు ఐపీఎల్ వేదికపై తన సత్తా చాటుతున్నాడు. ఒక్క ఇన్నింగ్స్‌తో ముకుల్ చౌదరి పేరు ఇప్పుడు సోషల్ మీడియాలో మారుమోగిపోతోంది. రిషభ్ పంత్ నేతృత్వంలోని లక్నో జట్టుకు ఇతను ఒక ప్రధాన అస్త్రంగా మారాడు. తన తండ్రి సరిహద్దులో దేశాన్ని రక్షిస్తే, తాను మైదానంలో పరుగుల వర్షం కురిపించి తండ్రి పేరు నిలబెడుతున్నానని ముకుల్ చెప్పిన మాటలు అభిమానుల హృదయాలను గెలుచుకుంటున్నాయి. మరిన్ని మ్యాచుల్లో ముకుల్ ఇలాగే రాణించి భారత జట్టులోకి రావాలని ఆశిద్దాం.





## తమ్ముడికి హ్యాండిచ్చిన సారా టెండూల్కర్..

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయ సారా టెండూల్కర్ లక్నోలో సందడి చేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య ఆదివారం జరిగే మ్యాచ్ కోసం ఆమె లక్నోకు వచ్చినట్లు తెలుస్తోంది. లక్నో ఎయిర్‌పోర్ట్‌లో సారా టెండూల్కర్‌ను చూసిన మీడియా ప్రతినిధులు.. ఎవరికి సపోర్ట్ చేస్తారంటూ ఆమెను ప్రశ్నించారు. గుజరాత్ టైటాన్స్ జట్టుకా..? లేక తన తమ్ముడు అర్జున్ టెండూల్కర్ ప్రాతినిధ్యం వహిస్తున్న లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు మద్దతు తెలుపుతారా? అని ప్రశ్నించారు. సారా టెండూల్కర్ మాత్రం సమాధానం చెప్పకుండా చిరునవ్వుతో వారికి దూరంగా వెళ్లిపోయింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తున్నారు. తన ప్రియుడు శుభ్‌మన్ గిల్ కోసమే సారా టెండూల్కర్ లక్నోకు వచ్చిందని, గుజరాత్ టైటాన్స్‌కే మద్దతు తెలుపుతుందని కామెంట్ చేస్తున్నారు. తమ్ముడు జట్టు అయిన లక్నో సూపర్ జెయింట్స్‌కు సపోర్ట్ చేసేందుకు అతను ఏమైనా తుది జట్టులో ఆడుతాడా? అని ప్రశ్నిస్తున్నారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని గుజరాత్ టైటాన్స్‌కు మద్దతు తెలిపేందుకే సారా లక్నోకు వచ్చిందని, లేకుంటే తన తమ్ముడు ప్రాతినిధ్యం వహిస్తున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు మద్దతు తెలుపుతానని మీడియాకు తెలిపేదని ఫ్యాన్స్ అంటున్నారు. ఏది ఏమైనా సొంత తమ్ముడికి సారా టెండూల్కర్ షాకిచ్చిందని, తమ్ముడు అర్జున్ టెండూల్కర్ కంటే ప్రియుడు శుభ్‌మన్ గిల్ ఎక్కువయ్యాడని కామెంట్ చేస్తున్నారు. సారా టెండూల్కర్, శుభ్‌మన్ గిల్ పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఇద్దరూ తమ ప్రేమ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ వార్తలను కూడా ఖండించలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో అర్జున్ టెండూల్కర్ లక్నో సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన లక్నో ఆదివారం సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. శుక్రవారం సారా టెండూల్కర్ లక్నో ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో ఈ మ్యాచ్ కోసమే సారా వచ్చిందని అంతా అనుకుంటున్నారు. కానీ ఆమె రాకపై ఎలాంటి క్లారిటీ లేదు. బహుషా అర్జున్ సతీమణి, తన మరదలుకు తోడుగా వచ్చి ఉంటుందని, అనవసర పుకార్లు పుట్టించవద్దని సచిన్ ఫ్యాన్స్ కోరుతున్నారు.



## ఈజీగా కోల్‌కతా ప్లేఆఫ్స్ చేరే ఛాన్స్..



ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో రెండు బలమైన జట్లు అయిన కేకేఆర్, చెన్నై సూపర్ కింగ్స్ వరుస ఓటములతో సతమతమవుతున్నాయి. కోల్‌కతా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటిలో ఓడిపోగా, ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో కేవలం ఒక పాయింట్‌తో తొమ్మిదో స్థానంలో ఉంది. జట్టు ప్రదర్శన అభిమానులను నిరాశపరుస్తున్నప్పటికీ, రాబోయే మ్యాచ్‌ల్లో పుంజుకుంటే అద్భుతాలు చేసే అవకాశం ఉంది.ఇటీవల లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో జరిగిన పోరులో కోల్‌కతా విజయం అంచు వరకు వెళ్లి బోల్తా పడింది. గెలిచే స్థితిలో ఉన్న మ్యాచ్‌ను ముకుల్ చౌదరి అద్భుత ప్రదర్శనతో కేకేఆర్ చేతుల నుంచి లాగేసుకున్నాడు. ఈ మూడు వికెట్ల తేడాతో వచ్చిన ఓటమి ఆ జట్టు ప్లేఆఫ్ అవకాశాలను మరింత సంక్లిష్టంగా మార్చింది. ప్రస్తుతం కోల్ కతా జట్టు ఖాతాలో 10 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి.ఈ టోర్నీలో మొత్తం 10 జట్లు పాల్గొంటున్నాయి. ఒక్కో జట్టు 14 మ్యాచ్‌లు ఆడాలి. కోల్‌కతా ప్లేఆఫ్స్ బెర్తు దక్కించుకోవాలంటే మిగిలిన 10 మ్యాచ్‌ల్లో కనీసం 8 మ్యాచ్‌లలో ఖచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. దీనివల్ల ఆ జట్టు ఖాతాలో 17 పాయింట్లు చేరుతాయి. సాధారణంగా 16 నుంచి 18 పాయింట్లు సాధించిన జట్టుకు నాకౌట్ దశకు వెళ్లే అవకాశం మెండుగా ఉంటుంది. విజయాలతో పాటు నెట్ రన్ రేట్ మెరుగుపరుచుకోవడం కూడా ఇక్కడ కీలకం కానుంది.వరుస ఓటముల నుంచి కోలుకోవడానికి కోల్‌కతాకు ఏప్రిల్ 14న జరిగే మ్యాచ్ ఎంతో కీలకం. పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న చెన్నై సూపర్ కింగ్స్‌తో ఈ మ్యాచ్ జరగనుంది. రెండు జట్లూ విజయాల కోసం ఆకలితో ఉండటంతో ఈ పోరు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల ఖాతాను తెరిస్తేనే కోల్‌కతా తన ఆశలను సజీవంగా ఉంచుకోగలదు. అంతకంటే ముందు ఏప్రిల్ 11న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనున్న చెన్నై జట్టు కూడా గెలుపుపై కన్నేసింది.




**సెగలు రేపుతున్న ఆషిక రంగనాథ్ హాట్ అందాలు**

# వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో!




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు'. ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# దసరాకు రిలీజ్ చేసేలా ఫౌజీ షూటింగ్ స్పీడ్




ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకులకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనులను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది. కాబట్టి.. దసరాకు ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# అమాయకత్వంలోనే అందం


ఉప్పెన' తర్వాత నేను పూర్తిస్థాయి ప్రేమకథలో నటించలేదు. ఈ సినిమా ఆ లోటుని తీర్చింది. ఈ ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది' అని చెప్పింది కృతిశెట్టి. ఆమె ప్రదీప్ రంగనాథన్ సరసన నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. విఘ్నేశ్‌శివన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నయనతార నిర్మించారు. ఈ సందర్భంగా గురువారం కృతిశెట్టి విలేకరులతో ముచ్చటించింది. ఇది 2040లో జరిగే కథ అని, ఈ ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుందని చెప్పింది. 'ఈ తరంలో డబ్బులు లేకపోయినా ఫర్వాలేదు. కానీ ఫోన్ లేకుండా ఉండటం చాలా కష్టం. అలాంటి మనస్తత్వం కలిగిన అమ్మాయి పాత్రను పోషించాను. భవిష్యత్తులో ప్రేమ కూడా ఇన్సూరెన్స్‌లో భాగం కావొచ్చు. ఈ సినిమాలో ఆ కాన్సెప్ట్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది' అని చెప్పింది. ప్రేమ విషయంలో తాను మాత్రం సంప్రదాయ భావాల్ని ఇష్టపడతానని, 'సీతారామం' '96' వంటి ప్రేమకథలు తనకు ఫేవరేట్ అని, ప్రేమ తాలూకు అమాయకత్వంలోనే ఓ అందం ఉంటుందని, ఈ తరం ప్రేమకు తాను ఏమాత్రం కనెక్ట్ కాలేనని కృతిశెట్టి చెప్పింది.

## మైఖేల్ జాక్సన్ బయోపిక్
# ట్రైలర్ విడుదల విడుదల




ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది . ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుండటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను మరియు వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. కేవలం ఒక సంగీత ప్రయాణంలా కాకుండా, ఒక లెజెండరీ స్టార్ జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరించే ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని హంగులతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# వారణాసి కథ ఇదేనా?




షూటింగ్‌కు ముందే తన సినిమా కథల్ని రివీల్ చేస్తుంటారు అగ్ర దర్శకుడు రాజమౌళి. చాలా సినిమాల విషయంలో ఆయన ఇదే ఆనవాయితీని పాటించారు. అయితే 'వారణాసి' సినిమాకొచ్చేసరికి కథాంశం విషయంలో కాస్త గోప్యత పాటిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్‌లో కథకు సంబంధించిన బేసిక్ లైన్‌ను మాత్రమే బయటపెట్టారు. టైమ్ ట్రావెల్ కథ ఇదని, రామాయణ ప్రస్తావన కూడా ఉంటుందని, ఓ ఎపిసోడ్‌లో హీరో మహేశ్‌బాబు రాముడి పాత్రలో కనిపిస్తాడనే వివరాల్ని వెల్లడించారు.అయితే అభిమానులు మాత్రం 'వారణాసి' అసలు కథేంటి అనే అన్వేషణలో పడ్డారు. ఈ నేపథ్యంలో సోషల్‌మీడియాలో అనేక లీకులొస్తున్నాయి. తాజాగా ప్రముఖ హాలీవుడ్ విజువల్ ఎఫెక్ట్స్ సంస్థ 'వారణాసి' కథ గురించి కొన్ని ఆసక్తికరమైన వివరాల్ని అందించింది. అద్భుతశక్తులు కలిగిన త్రేతాయుగం నాటి మహిమాన్విత విశ్వ కళాఖండాన్ని సాధించి, తద్వారా ప్రపంచ ఆధిపత్యాన్ని సాధించాలనే దురాలోచన చేస్తాడు క్రూరుడైన కుంభ (పృథ్వారాజ్ సుకుమారన్). దాని సాధనకై శివ భక్తుడైన రుద్ర (మహేశ్‌బాబు)ను ఎంచుకుంటాడు. కుంభ (పృథ్వీరాజ్ సుకుమారన్) ఆదేశాల మేరకు టైమ్ ట్రవెల్ చేసి ఆ శక్తిని సాధించేందుకు పూనుకుంటాడు రుద్ర. ఈ క్రమంలో అతను కొన్ని పురాతన రహస్యాలతో పాటు ఓ చీకటి నిజాన్ని తెలుసుకుంటాడు. కుంభ ఓ కుట్రదారుడని, ప్రపంచ ఆధిపత్యం కోసమే తనను ఈ కాలయాత్రకు పురమాయించాడని అర్థం చేసుకుంటాడు.ఈ నేపథ్యంలో రామాయణ కాలంనాటి ఆ కళాఖండాన్ని పొందడానికి రుద్ర ఏం చేశాడు? కుంభ కుట్రల్ని ఎలా ఛేదించాడు? అన్నదే ఈ చిత్ర కథ అని సదరు విజువల్ ఎఫెక్ట్స్ సంస్థ తన కథనంలో పేర్కొన్నది. ఈ వార్తలో నిజమెంతో తెలియదు కానీ..సోషల్‌మీడియాలో మాత్రం తెగ వైరల్ అవుతున్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న 'వారణాసి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com